క్లుప్తంగా

బర్కత్‌పురాలో ఫుట్ పెట్రోలింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని బర్కత్‌పురా, అహ్మదీబజార్‌లో ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలు సేకరించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమానాస్పద వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోలింగ్‌లో 20 మంది స్పెషల్ పోలీసులు పాల్గొన్నట్లు చెప్పారు.

నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పెంట దత్తాద్రి


నియామక పత్రాలు అందుకున్న నగర కార్యవర్గసభ్యులతో ఎన్నికల అధికారులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పెంట దత్తాద్రి విజయం సాధించారు. ఆదివారం నగరంలోని పద్మశాలి ఉన్నత పాఠశాలలో సంఘం ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. అర్ధరాత్రి తర్వాత ఫలితాలు వెలువడ్డాయి. ఎన్నికల్లో మూడు ప్యానెళ్లు పోటీపడ్డాయి. కొండా లక్ష్మణ్ బాపూజీ ప్యానెల్ నుంచి అధ్యక్షుడిగా పెంట దత్తాద్రి, ప్రధాన కార్యదర్శిగా చౌకి భూమేశ్వర్, కోశాధికారిగా మోర సాయిలు, ఉపాధ్యక్షులుగా ఎనగందుల మురళి, కన్న దుబ్బరాజం, బాగుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా అవదూత రాములు, ఎనగందుల సుభాష్, బూస రవి, ప్రచార కార్యదర్శిగా బూస శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కస్తూరి గంగరాజు గెలిచారు. విజయం సాధించిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి గంగా ప్రసాద్ ధ్రువపత్రాలు అందజేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ తండాకు చెందిన రవి సెల్‌ఫోన్ 15 రోజుల క్రితం పోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితుడు రవికి అప్పగించినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. ఎవరైనా ఫోన్‌ను పోగొట్టుకుంటే దానికి సంబంధించిన వివరాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించాలని ఎస్సై సూచించారు. ఆ ఫోన్ ఎవరికైనా దొరికినా.. ఉద్దేశపూర్వకంగా ఎత్తుకెళ్లినా.. వారు వాడితే లొకేషన్ చూయిస్తుందని, ఫోన్‌ను రికవరీ చేయొచ్చని తెలిపారు.

తెరవే మహాసభను విజయవంతం చేయండి



నిజామాబాద్ రూరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జూన్ 1న కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెరవే నిజామాబాద్ అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ తెలిపారు. సోమవారం వినాయక్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మహాసభకు విమలక్క, జయధీర్ తిరుమల రావు, కొండి మల్లారెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి వేముల శేఖర్, మురళి పాల్గొన్నారు

కత్తులతో దాడి చేసుకున్న రౌడీషీటర్లు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఇద్దరు రౌడీ షీటర్లు కత్తులతో దాడులు చేసుకున్నారు. ఆటోనగర్‌లోని గౌసియా మసీదు వద్ద బర్సాత్ ఆమీర్, మోహిజ్ డాన్‌లు కత్తులతో దాడి చేసుకోవడానికి యత్నించగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకెళ్తుండగా బర్సాత్ ఆమీర్ పోలీసు వాహనం నుంచి దూకి పరారయ్యారు. మోహిజ్ డాన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బర్సాత్ ఆమీర్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇబ్రహీం చావూస్ ఆలియాస్ జంగిల్ ఇబ్బు, ఆరిఫ్ డాన్ రౌడీషీటర్ల హత్య కేసులో ఈ ఇద్దరి ప్రమేయం ఉంది. గత కొన్నిరోజులుగా రెండు గ్యాంగులకు చెందిన అనుచరులు సైలెంట్‌గా ఉండగా, మళ్లీ కత్తులు దూసుకోవడంతో ఎలాంటి ఘటనలు జరుగుతాయనే చర్చ మొదలైంది.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని సాయినగర్ పరిధి ఆకుల పాపయ్య రోడ్‌లో దుండగులు చైన్‌స్నాచింగ్‌కు యత్నించారు. కాలనీకి చెందిన మాధవి భర్తతో కలిసి ఉదయం 5:30 గంటలకు వాకింగ్ వెళ్తుండగా దుండగులు గొలుసు చోరీకి యత్నించారు. బాధితులు డయల్ 100 కు ఫోన్ చేయగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కాగా, చైన్ స్నాచింగ్ చేసే సమయంలో బంగారు గొలుసు తెగిపోవడంతో బాధితులు ఫిర్యాదు చేయలేదని తెలుస్తుంది.

ఇళ్ల రీ సర్వేలో ఇబ్బందులు

- అడ్డుకుంటున్న స్థానిక నాయకులు
- తాము చెప్పినవారి పేర్లు ఓకే చేయాలని ఒత్తిడి
- అధికారులతో మొర పెట్టుకున్న ఏఈ, వార్డు ఆఫీసర్లు



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల రీ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇళ్లు లేనివారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుంది. ఈ కార్యక్రమం రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 లోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయనున్నారు. కానీ క్షేత్రస్థాయిలో కొందరు స్థానిక నేతలు అధికారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తాము చెప్పినవారి పేర్లు ఓకే చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. పైస్థాయి నేతలతో మాట్లాడిస్తున్నారు. తమ మాట వినకుంటే ఆయా డివిజన్ల నుంచి వెనక్కి పంపిస్తున్నారు. తాము మరో అధికారిని వేయించుకుంటామని హెచ్చరిస్తున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో ఇబ్బందులు

నగరంలో ఇందిరమ్మ ఇళ్ల రీసర్వే చేస్తున్న బృందానికి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నగరంలోని కొన్ని సమస్యాత్మక డివిజన్లతోపాటు మరికొన్నిచోట్ల స్థానిక నేతల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. సర్వేకు వెళ్లిన అధికారులను సర్వే చేయకుండా అడ్డుకుంటున్నారు. శనివారం సర్వేకు వెళ్లిన ఏఈతోపాటు వార్డు ఆఫీసర్‌ను స్థానిక నాయకుడు అడ్డుకున్నాడు. తాము చెప్పినవారిపేర్లు ఓకే చేయాలని ఒత్తిడితెస్తున్నారు. వాస్తవానికి వారికి సొంత భవనాలున్నా తమకు ఇళ్లు లేవని తప్పుడు సమాచారం ఇస్తున్నారు. తమ ఇంటికి తాళం వేసి ఏదో పాత ఇంటి వద్ద నిలబడి ఇదే తమ స్థలమని రాసుకొమ్మని బెదిరిస్తున్నారు. తప్పుడు వివరాలు నమోదుచేయడానికి అంగీకరించని అధికారిని బలవంతంగా డివిజన్ నుంచి పంపించివేశారు. దానితోపాటు ఓ పార్టీకి చెందిన డివిజన్ స్థాయి నాయకుడు మరో పెద్ద నాయకుడితో ఫోన్‌లో మాట్లాడించారు. తమ పార్టీవారి పేర్లు తప్పకుండా ఉండేలా చూడాలని ఆ నేత కూడా చెప్పడంతో అధికారులు తలపట్టుకుంటున్నారు. చివరకు మున్సిపల్ కమిషనర్‌కు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. కొన్నిచోట్ల సరియైన ధృవీకరణ పత్రాలు లేకున్నా తమ పేర్లు ఓకే చేయాలని ఒత్తిడితెస్తున్నారని, మరో డీఈ కూడా వాపోతున్నారు. తమ డివిజన్లలో సర్వే చేయవద్దని,తాము మరో అధికారిని నియమించుకుంటామని సర్వే చేస్తున్నవారిని తిప్పి పంపించారు.

రెండు వేల దరఖాస్తులు..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఇందూరు నగరంలో 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిలో సొంత స్థలం ఉండి, ఇళ్లు లేనివారికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు. వీరిలో దాదాపు రెండు వేల మంది దరఖాస్తుదారులను గుర్తించారు. వారి వివరాలను బల్దియా అధికారుల బృందం క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇందుకు ఏఈలతోపాటు వార్డు ఆఫీసర్లను నియమించారు. ప్రతి డివిజన్‌లో ఈ రీసర్వే కొనసాగుతోంది.

సరైన వివరాలు మాత్రమే నమోదు చేయాలి



ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల రీసర్వేలో స్థానిక నేతల వల్ల కొందరికి ఇబ్బందులు వచ్చినట్లు తెలిసింది. సమస్యలుంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలి. వివరాలు మాత్రం కచ్చితంగా నమోదు చేయాలి. తప్పుడు వివరాలు నమోదుచేస్తే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్

సాగులో రైతులు పాత పద్ధతులు వీడాలి


మాట్లాడుతున్న కోటపాటి నరసింహ నాయుడు

జక్రాన్‌పల్లి: రైతులు పాత పద్ధతులు వీడి, భూసార పరీక్షలు జరిపించుకొని, అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను పండించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా కమిటీ సభ్యుడు కోటపాటి నరసింహ నాయుడు అన్నారు. కలిగోట్ రైతు వేదికలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం పొందడం, ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు పాటించి, రసాయనిక, పురుగు మందులను తగ్గిస్తూ ఆరోగ్యకరమైన దిగుబడిని సాధించడానికి రైతులు కృషి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారిణి దేవిక, కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, వ్యవసాయ శాస్త్రవేత్తలు కృష్ణ చైతన్య, సాయి ప్రసాద్, అర్గుల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జిల్లా వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎంపిక


నర్సింహులు, అధ్యక్షుడు


బత్తుల శంకర్, ప్రధాన కార్యదర్శి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వడ్డెర జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ తెలిపారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని దాస్‌నగర్‌లోని సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా ర్యాపని నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల శంకర్‌లను ఎన్నుకున్నట్లు దండి వెంకట్ తెలిపారు.

ధర్పల్లిలో తిరంగా ర్యాలీ



ధర్పల్లి: ఆపరేషన్ సింధూర్‌తో పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైనికుల ధైర్యాన్ని కీర్తిస్తూ ధర్పల్లి మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత సాయుధ దళాలకు గౌరవ సూచకంగా మండల ఆల్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీ గాంధీ చౌక్ నుంచి నెహ్రూ కాలనీ వరకు కొనసాగింది. ర్యాలీలో జాతీయ జెండాను పట్టుకుని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ చెందిన నాయకులు కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

డ్రైయినేజీల్లో పూడిక తొలగింపు


శివాజీచౌక్‌లో డ్రైయినేజీలోని చెత్తను తొలగిస్తున్న పొక్లెయిన్

సాక్షి ఎఫెక్ట్..

నగర రోడ్లపై నడవగలమా' అనే వార్తా కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శివాజీచౌక్‌లో వర్షపునీరు, మురికినీరు కలిసి రోడ్డుపై ప్రవహిస్తుండడంతో నడవలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ దృష్టికి తీసుకురావడంతో సోమవారం అధికారులు పొక్లెయిన్‌తో డ్రైనేజీని శుభ్రం చేయించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

28న 'కశ్మీర్ చరిత్రలో వక్రీకరణలు– వాస్తవాలు'పై సదస్సు

- ప్రధాన వక్తగా చరిత్ర పరిశోధకులు రాకా సుధాకర్ రాక

సుభాష్‌నగర్: పహల్గామ్ ఉగ్రవాదుల దాడి, తదనంతర పరిణామాల వెనక ఉన్న వాస్తవాలు, కశ్మీర్ చరిత్రలో వక్రీకరణలు – వాస్తవాలు అనే అంశంపై ఈ నెల 28న సాయంత్రం 6 గంటలకు నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల పట్టణ మున్నూరుకాపు కల్యాణ మండపంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతిహాస సంకలన సమితి జిల్లా అధ్యక్షుడు చిలుముల మోహన్ సభాధ్యక్షతన జరిగే సదస్సుకు ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు, అజ్ఞాత కశ్మీర్ ఫైల్స్ పుస్తక రచయిత రాకా సుధాకర్ ప్రధాన వక్తగా, ముఖ్యఅతిథిగా రవి విద్యాసంస్థల అధినేత, ప్రముఖ హైకోర్టు న్యాయవాది కాటిపల్లి మహేందర్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. అఖండ భారత స్వాప్నికుడు స్వాతంత్ర వీర సావర్కర్ జయంతి సందర్భంగా ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ దాడి హేయనీయం

వేల్పూర్: సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ దాడి హేయనీయమని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడితే వారిని అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులతో కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలన చేస్తోందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లోని క్యాంప్ కార్యాలయాల్లో ఆనాటి సీఎం కేసీఆర్ ఫొటో పెట్టారా? అని ప్రశ్నించారు. మరి ఇప్పుడు మా ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. ఏం ప్రొటోకాల్ ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెక్రటేరియట్‌లోని ఆయన చాంబర్‌లో ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీ ఫొటోలు పెట్టారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలపై దాడులు చేయాలని చూస్తే సహించేది లేదన్నారు.

ప్రధాని మోదీతో దేశం సురక్షితం

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి


ర్యాలీలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి

నందిపేట్(ఆర్మూర్): పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను సాధించుకోవడమే లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించే వరకు కొనసాగుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల ఘన విజయం సాధించడంతో సోమవారం సాయంత్రం నందిపేట మండల కేంద్రంలోని పెద్ద మసీద్ నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీతోనే దేశం సురక్షితంగా ఉంటుందని, ఆయనే దేశానికి రక్షకుడని అన్నారు. నేతలు పెద్దోల్ల గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

ఎడపల్లి(బోధన్): జానకంపేట గ్రామ శివారు నితిన్ పేపర్ ప్లేట్స్ దుకాణ సముదాయంలో సోమవారం తెల్లవారుజామున దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించి అందినంత దోచుకెళ్లారు. సుమారు 2.20 నిమిషాల ప్రాంతంలో దుకాణం షట్టర్‌ను ధ్వంసం చేసి లోపలికి చొరబడిన ముగ్గురు దొంగలు కౌంటర్‌లో ఉన్న నగదుతోపాటు సుమారు 50 వేల సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని ఎడపల్లి పోలీసులు పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీరప్ప స్వామి కల్యాణం


హాజరైన పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్

మోపాల్: నగర శివారులోని బోర్గం(పి) ఐదో డివిజన్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో బోనాలను పెద్ద ఎత్తున ఊరేగించారు. బీరప్ప కల్యాణోత్సవానికి జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్, నుడా చైర్మన్ కేశ వేణు, కురుమ సంఘం జిల్లా నాయకులు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమాజం సంఘటితం కావాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఘనంగా ఉమా మహేశ్వర స్వామి ఆలయ సిల్వర్ జూబ్లీ వేడుకలు


ఆలయ ట్రస్ట్ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్

సుభాష్‌నగర్: దేవాలయాలు, హిందువులపై దాడులు జరుగుతున్నాయని, వీటిని ఎదుర్కోవాలంటే హిందు సమాజం సంఘటితం కావాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల ఉమా మహేశ్వర స్వామి ఆలయ సిల్వర్ జూబ్లీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డితో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానవులు ప్రశాంత జీవనాన్ని గడపాలంటే దైవమార్గం ఒక్కటే సరైనదన్నారు. హిందువులుగా ప్రతిఒక్కరూ ఐక్యతతో మన సంస్కృతీ, సాంప్రదాయాలను పాటిస్తూ భావితరాలకు వాటిని అలవాటు చేయాలని సూచించారు. దేవాలయాల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. ఆ భగవంతుడి ఆశీర్వాదంతో గంజ్‌కు పూర్వవైభవం వస్తుందని ఆకాంక్షించారు. అనంతరం దేవాలయ ట్రస్ట్ సభ్యులను ముప్పగంగారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ధన్‌పాల్ సన్మానించారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు వడ్డి మోహన్‌రెడ్డి, ధన్‌పాల్ దత్తాత్రి, మాస్టర్ శంకర్, మారుతి మల్లేష్, లాభిశెట్టి శ్రీనివాస్, రామ్ స్వరూప్ దాలియా, కమల్ కిషోర్ ఇనాని, వివిధ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలి


కంజర్‌లో ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో


కొరట్‌పల్లిలో .. కాంగ్రెస్ నాయకులు

సుభాష్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధనల ప్రకారమే ఇళ్లను నిర్మించుకోవాలని ఎంపీడీవో రాములు నాయక్ సూచించారు. సోమవారం కంజర్, మోపాల్, సింగంపల్లి, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో ఆధ్వర్యంలో మార్క్‌ఔట్ చేపట్టి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారమే ఇళ్లను నిర్మించుకుంటేనే నిధులు వస్తాయని స్పష్టంచేశారు. ఎంపీవో కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి భార్గవి, ఇందిరమ్మ కమిటీ ప్రతినిధులు చిన్న గంగారెడ్డి, శోభ, గుడి చిన్నారెడ్డి, నారాయణరెడ్డి, ఖదీర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

డిచ్‌పల్లి: కొరట్‌పల్లిలో సోమవారం ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుడు డాక్టర్ జహూర్, కాంగ్రెస్ నాయకులు పార్వతి గంగారెడ్డి, మైహన్, లయ, గ్రామ శాఖ అధ్యక్షుడుశ్రీనివాస్, తదితరులున్నారు.


లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నేత బాకారం రవి

ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

సిరికొండ: తాళ్లరామడుగులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి సోమవారం అందజేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాకారం సంతోష్, కుందేళ్ల శ్రీనివాస్, బండారి నరేష్, సుజాత, నర్సవ్వ, కృష్ణారెడ్డి, పెళ్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల కోసం స్థలం పరిశీలన


స్థలం వివరాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కేంద్రం డిచ్‌పల్లి మండలానికి గత ఏడాది ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. ప్రస్తుతం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోనే డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మాణం కోసం సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి నడిపల్లి శివారులోని సర్వే నెంబర్ 334లో గల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, డిచ్‌పల్లి తహసీల్దార్ కే.సతీష్‌రెడ్డిలు ఎమ్మెల్యేకు భూమి వివరాలను తెలియజేశారు.సుమారు 6 ఎకరాల అసైన్‌మెంట్ స్థలం అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని వసతి సౌకర్యాలు ఉండేలా నిర్మించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో డిగ్రీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా స్థల కేటాయింపు జరిగేలా చూడాలని ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఎమ్మెల్యే సూచించారు. ఆర్ఐ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎంపీపీ యాదగిరి, డీసీసీ డెలిగేట్స్ వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యాంసన్, పెద్దోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,800	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	89,355		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	40	60

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 ఏస్(తెలుగు)-1.30, 7.35
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.30, 10.30
స్క్రీన్-2 ఒక బృందావనం(తెలుగు)-11.00
నిశ్శబ్ద ప్రేమ(తెలుగు)-4.30
సింగిల్(తెలుగు)-1.30, 7.30, 10.30
స్క్రీన్-3 ఒక బృందావనం(తెలుగు)-4.30, 10.20
లిలో అండ్ స్టిచ్(ఇంగ్లీష్ 3డీ)-1.30 , 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్ -10.10, .25, 10.40
సింగిల్(తెలుగు)-1.40, 7.55
స్క్రీన్-2 లిలో అండ్ స్టిచ్(3డీ తెలుగు)-11.30,2.00
ఏస్(తెలుగు)-4.30, 10.20
ఒక బృందావనం(తెలుగు)-7.40
స్క్రీన్-3 భూల్ చుక్ మాఫ్(హిందీ)-11.35, 8.00, 10.40
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-2.15
హిట్(తెలుగు)-4.45
స్క్రీన్ -4 వీరరాజు-1991(తెలుగు)-11.00
వర్షం(తెలుగు)-1.40 -శుభం(తెలుగు)-7.30
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లీష్)-5.00, 10.10
లలితామహల్ యమదొంగ దేవి సింగిల్
నటరాజ్ మిషన్ ఇంపాజిబుల్ విజయ్ హిట్